Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU





అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 331 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 20 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## సీఎం చంద్రబాబు అన్ని సౌకర్యాలు కల్పించారు : వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన సాయాన్ని తాము మర్చిపోలేమన్నారు. తమ 30 ఏళ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు జీవితంలో పూర్తవుతుందని తాము అనుకోలేదని అన్నారు. చూడలేం అనుకున్న ప్రాజెక్టును చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని నిర్వాసితులు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సీఎం చంద్రబాబు నాయుడు చెక్కులు అందజేశారు. బుధవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో సీఎంను ప్రాజెక్టు నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా వారికి రూ.200 కోట్ల మేర పరిహారం చెక్కులు అందించారు. అనంతరం నిర్వాసితులుపై విధంగా స్పందించారు.

**ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితులు ముఖ్యం: మంత్రి నిమ్మల**

వెలుగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసిందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పూర్తి కాని వెలుగొండ ప్రాజెక్టు పూర్తయినట్లు వైఎస్ జగన్ జాతికి అంకితం చేయటం ప్రపంచంలో 8వ వింత అని అభివర్ణించారు. నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం చెల్లింపులో నాడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పైసా కూడా చెల్లించలేదని ఆయన గుర్తు చేశారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయటం ఎంత ముఖ్యమో.. నిర్వాసితులు కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. నిర్వాసితుల కోసం నిర్మించిన 7 కాలనీల్లో నాలుగింటిలో 100 శాతం మౌలిక వసతులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన 3 కాలనీల్లోని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

**నిర్వాసితులకు మిగిలిన పరిహారం త్వరలో చెల్లిస్తాం: మంత్రి డోలా**

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మిగిలిన రూ. 400 కోట్లు త్వరలోనే చెల్లిస్తామని సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఈ ఆగస్టులోనే నల్లమల్ల సాగర్‌కు నీరిస్తామని పేర్కొన్నారు. వెలుగొండ నిర్వాసితులను గొడ్డలి పార్టీ దారుణంగా మోసగించిందంటూ ఆయన మండిపడ్డారు. పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత ఆ పార్టీ నాయకుడికే చెల్లిందంటూ వైఎస్ జగన్ తీరును మంత్రి డోలా ఈ సందర్భంగా ఎండగట్టారు. గతంలో చెప్పినట్లే.. మార్కాపురం జిల్లాను ప్రకటించామని ఆయన గుర్తు చేశారు. వెలుగొండ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి ప్రారంభిస్తున్నారని గుర్తు చేశారు. గ్రామాలు ఖాళీ చేయాలని ఈ సందర్భంగా నిర్వాసితులకు మంత్రి డోలా విజ్ఞప్తి చేశారు.

## వైసీపీ హయాంలో.. గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ఏపీ శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏపీపీఎస్సీ ఏర్పడిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సర్వీసుల్లోకి వచ్చే అధికారులను గ్రూప్-1 పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. అలాంటి పరీక్షల్లో గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజలు, ఉద్యోగార్థులు ఈ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని తాను చాలాసార్లు చెప్పానని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోని వివిధ వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం పోయేలా గత పాలకులు వ్యవహరించారని విమర్శించారు. 2018లో గ్రూప్-1 సర్వీసులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 1.14 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని చంద్రబాబు తెలిపారు. వారిలో 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని చెప్పారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను అత్యంత భద్రత మధ్య పోలీసు ఎస్కార్ట్‌తో తరలిస్తామని, అలాంటిది రాష్ట్రాన్ని పాలించే అధికారులను ఎంపిక చేసే పరీక్షల విషయంలో మరింత భద్రత ఉండాలని అన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరించారని ఆరోపించారు. గ్రూప్-1 పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో డిజిటల్ విధానాన్ని పక్కనపెట్టి మాన్యువల్ మూల్యాంకనం చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు చంద్రబాబు తెలిపారు. అయినప్పటికీ కోర్టును తప్పుదోవ పట్టించేలా అఫిడవిట్లు దాఖలు చేసి వ్యవహరించారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వుల తర్వాత పరిస్థితిని సరిదిద్దుకోవాల్సి ఉండగా, హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం కోసం రూ. 1.19 కోట్ల పనులకు ఉత్తర్వులు ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు కూడా చేశారన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను పక్కనపెట్టి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని సీఎం విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులు రాసిన పరీక్ష పత్రాలను ఎలక్ట్రిషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులతో మూల్యాంకనం చేయించారని సీఎం చంద్రబాబు ఆరోపించారు.

## ఒక ఛాయాచిత్రం.. వెయ్యి మాటల భావం

**- క్షణాన్ని బంధించి.. శాశ్వత జ్ఞాపకంగా నిలిపే కళ ఫొటోగ్రఫీ - సంఘటనలకు సజీవ సాక్ష్యాలుగా ఛాయాచిత్రాలు - సమాజంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం - ప్రతిఒక్కరికీ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు - ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు నగదు బహుమతులు, సత్కారం : ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఒక ఛాయాచిత్రం.. వెయ్యి మాటల భావానికి ప్రతిరూపమని, ఒక క్షణాన్ని శాశ్వతంగా బంధించి ఆ క్షణంలోని భావోద్వేగాన్ని, సంఘటనను, చరిత్రను భావితరాలకు అందించే అద్భుతమైన కళ ఫొటోగ్రఫీ అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తొలుత జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, సమాచార, పౌర సంబంధాల శాఖ జోన్ - 2 ఆర్‌జేడీ పి.తిమ్మప్ప, జిల్లాస్థాయి ఫొటోగ్రఫీ పోటీల జ్యూరీ సభ్యులు టీఎస్ రెడ్డి (ఎఫ్‌ఆర్‌పీఎస్), సీహెచ్ విజయభాస్కరరావు (ఏఆర్‌పీఎస్), కె.రవికుమార్ తదితరులతో కలిసి ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని.. ఫొటోగ్రఫీ అనేది క్షణాలను చిత్రాలుగా మలిచి, జ్ఞాపకాలను పదిలపరిచి, మాటలకు అందని కథలను ప్రపంచానికి చెప్పగల శక్తివంతమైన మాధ్యమం అని పేర్కొన్నారు. ఒక మంచి ఛాయాచిత్రం ఒక సంఘటనను సరైన విధంగా నిక్షిప్తం చేసి..సమాజంలోని భావోద్వేగాలను, సంస్కృతిని, అభివృద్ధిని, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న ముఖ్యమైన సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఫొటో జర్నలిస్టుల్లోని ప్రతిభను ప్రోత్సహించి, గుర్తించి, సత్కరించేందుకు ఏటా జిల్లాస్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నామని.. భవిష్యత్తులో వీడియో జర్నలిస్టులు, అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్లను కూడా వీటిలో భాగస్వామ్యం చేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. లిఆర్‌డీవో వెన్నెల శ్రీను మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు సంస్కృతి, కళలు, వారసత్వానికి కూడా ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ ఫొటోగ్రాఫర్ల ప్రతిభను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐ అండ్ పీఆర్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.తిమ్మప్ప మాట్లాడుతూ జర్నలిస్టులు అక్షర సైనికులు అయితే ఫొటోగ్రాఫర్లు దృశ్య సైనికులు అని.. ఒక ఘటనను శాశ్వత జ్ఞాపకంగా పొందుపరిచే అద్భుత కళ ఫొటోగ్రఫీ అని పేర్కొన్నారు. ఫొటో జర్నలిస్టులు సమ దృష్టితో తీసే ఫొటోలు సామాజిక బాధ్యతకు ప్రతిరూపాలుగా నిలుస్తాయని, ఓ గొప్ప మార్పునకు, అభివృద్ధికి దోహదపడతాయని తిమ్మప్ప అన్నారు. ప్రముఖ ఫొటోగ్రాఫర్ టీఎస్ రెడ్డి, సీనియర్ ఫొటోగ్రాఫర్ విజయభాస్కరరావు తదితరులు ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఫొటోగ్రాఫర్ల తరఫున కలెక్టర్ లక్ష్మీశకు ధన్యవాదాలు తెలియజేశారు.

**27 మంది విజేతలకు నగదు బహుమతులు:**

ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, వారసత్వం, పర్యాటకం, యువత, పీ4, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, ఉత్తమ న్యూస్ పిక్చర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా... మొత్తం 221 ఛాయాచిత్రాల ఎంట్రీలుగా రాగా.. 27 ఉత్తమ ఛాయాచిత్రాలను జ్యూరీ సభ్యులు ఎంపిక చేశారు. వీరికి కలెక్టర్ లక్ష్మీశ అతిథులతో కలిసి నగదు బహుమతులు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. కేటగిరీ 1 ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, వారసత్వం, పర్యాటకంలో ప్రథమ బహుమతి వైవీవీ సత్యనారాయణ, ద్వితీయ బహుమతి ఎన్.కిశోర్, తృతీయ బహుమతి ఎం.ప్రశాంత్ సాధించగా యు.దుర్గారావు, పి.ప్రసాద్, వైవీ ఆనంద్, ఆర్‌వీ అప్పారావు, కె.తిరుపతయ్య, కేబీ నవీన్‌లు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కేటగిరీ 2 యువత, పీ4, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమంలో ప్రథమ బహుమతి జీఎన్ రావు, ద్వితీయ బహుమతి సీహెచ్ నారాయణరావు, తృతీయ బహుమతి ఎస్‌ఎస్ విజయబాబులు సాధించగా సీహెచ్ మస్తాన్, మణికంఠ, సీహెచ్ నారాయణరావు, బి.సతీష్ కుమార్, రాజేష్, బి.మరిడయ్యలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.

అదేవిధంగా కేటగిరీ 3 ఉత్తమ న్యూస్‌పిక్చర్‌లో కేవీఎస్ గిరి, ద్వితీయ బహుమతి ఎ.రాజేంద్రప్రసాద్, తృతీయ బహుమతి దుర్గాప్రసాద్ సాధించగా ఎ.రామ చంద్రరావు, కె.చక్రపాణి, జి.మహేష్, బి.మరిడయ్య, ఎం.సంపత్ కుమార్, ఎస్.లక్ష్మీపవన్ ప్రోత్సాహక బహుమతులను అందు కున్నారు. ఫొటోగ్రఫీ పోటీల్లో బహుమతులు పొందిన ఛాయా చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనతో పాటు, సీనియర్ ఫొటో గ్రాఫర్ పొట్లూరి ప్రసాద్ దశాబ్దాలుగా విశేష కృషితో సేకరించిన అరుదైన, వివిధ రకాల కెమెరాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీపీఆర్‌వో ఎన్.నాగేశ్వరరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఫొటోగ్రఫీ పోటీల సమన్వయకర్త వీవీ ప్రసాద్, వీఎంసీ పీఆర్‌వో డా. రజియా షబీనా, సహాయ సమాచార ఇంజనీర్ కె.ధనుంజయరాజు, ఏవీఎస్ బి.బాలాజీ, ఫొటో జర్నలిస్టులు, స్టూడియో ఫొటోగ్రాఫర్లు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.13,041 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం



**ఇంటర్నెట్ డెస్క్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్ పూర్-భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ. 1,583 కోట్లు, కటక్-పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించారు. ఈ రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. అలాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామర్హి-సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

## ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు : నారాయణ

**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్, మున్సి పల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సి పల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎన్నికల్లో నేరు ఎంపికైన వారికి బలమైన ప్రజామోదం ఉంటుందని అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సి లర్లు, కార్పొరేటర్ల ప్రభావం మేయర్, మున్సిపల్ చైర్మన్‌పై ఉం డదని స్పష్టం చేశారు. వీరిద్దరు వేగవంతమైన నిర్ణయాలు తీసు కునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే సుదీర్ఘ అభి వృద్ధి ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉంటుందని అన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చునని చెప్పారు. పెట్టుబడిదారులు, పరిశ్ర మలు, పర్యాటక రంగాన్ని మేయర్, చైర్మన్ యాక్టివ్‌గా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వీరిద్దరిపై రాజకీయ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజ లకూ అవసరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. అంతకుముందు అసెంబ్లీలో పురపాలక శాసనాల 4వ సవరణ బిల్లును మున్సిపల్ పరపాలన శాఖ మంత్రి నారాయణ




ప్రవేశపె ట్టారు. దీనికి సంబంధించిన చట్ట సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపిక ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరగనుంది. ఇప్పటి వరకూ వీరిద్దరిని పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటున్న సంగతి తెలిసిందే.

# ఈ నెలలోనే వెలిగొండ వెలుగులు

## - నెరవేరబోతున్న మూడు దశాబ్దాల చంద్రన్న కల : జలవనరుల శాఖ మంత్రి ఎన్. రామానాయుడు



**అమరావతి, (రాజధాని వార్తలు):** కరువు పీడిత, ఫ్లోరైడ్ బాధిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో వెలిగొండ ద్వారా వెలుగులు నింపబోతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1996లో నేటి గౌరవ ముఖ్యమంత్రి, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెలిగొండ శంకుస్థాపన జరిగిందన్నారు. అదే చంద్రబాబు నాయుడు నేడు కూటమి ప్రభుత్వ అధినేతగా ఈ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేసి ఈ నెలలోనే నీరు ఇవ్వటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఇదే వెలిగొండ పూర్తికాకుండానే ప్రారంభోత్సవం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేసిన వైసిపి పార్టీ అధినేత జగన్ చరిత్ర హీనుడిగా ప్రజల మదిలో మిగిలిపోయాడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 లో జలవనరుల శాఖ సమీక్షలో 2026 ఆగస్టు కల్లా వెలిగొండని పూర్తి చేయాలని ఆ రోజు చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ఆ లక్ష్యసాధనకు అనుగుణంగా ఈ రెండేళ్లలో, హెడ్ రెగ్యులేటర్‌కి సంబంధించి జజవాల్స్ గానీ, వింగ్స్ గానీ అవన్నీ కూడా మొన్న 2026 మే నెలకి పూర్తి చేశామన్నారు. అలాగే కృష్ణా నది నుంచి టన్నెల్ కి వచ్చేటువంటి ఆ నీటికి అప్రోచ్ ఛానల్ దగ్గర 80 వేల మెట్రిక్ టన్నులు మక్‌ను కూడా తొలగించినట్లు చెప్పారు. నీరు వచ్చే మార్గాన్ని కూడా ఈ ఏడాదే ఏర్పాటు చేశామన్నారు. 5 కిలోమీటర్ల బెంచింగ్ టన్నెల్‌లో ఉండిపోతే, ఈ రెండేళ్లలోనే ఆ 5 కిలోమీటర్ల బెంచింగ్‌ని పూర్తి చేశామన్నారు. టన్నెల్ 2 లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి చూస్తే 7 కిలోమీటర్లు, అంటే 7,000 మీటర్ల లైనింగ్ మిగిలి ఉన్నటువంటి పరిస్థితి ఉందన్నారు. ఈ రెండేళ్లలో రేయింబవళ్లు పనిచేసి 6,907 మీటర్లు పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన 81 మీటర్లు ఐదారు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా టన్నెల్ బోరింగ్ మిషన్ తొలగింపు విషయంలో అప్పటి వైకాపా ప్రభుత్వం చేతులెత్తేసింది అన్నారు. అటువంటి ఎదీవీ తొలగింపు విషయంలో న్యాయవివాదాలను గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పట్టించుకుని పరిష్కరించారన్నారు. 1900 టన్నులు బరువు, 175 మీటర్ల పొడవు ఉన్నటువంటి ఎదీవీ మిషన్ తొలగింపు.. సంక్లిష్ట పనిని చాకశక్యంగా దాదాపు చేశామన్నారు. టిబిఎం శకలాల తాలూకు వ్యర్థాలు ఇంకా 300 టన్నులు ఉన్నాయని వీటిని మరో నాలుగు, ఐదు రోజుల్లో తొలగిస్తామని మంత్రి చెప్పారు. అలాగే అతి ముఖ్యమైన ఫీడర్ కెనాల్ నడవడానికి వీలు లేని పరిస్థితిలో ఉండేదన్నారు. అటువంటి 21 కిలోమీటర్ల పొడవున్న ఫీడర్ కెనాల్‌కు కూటమి ప్రభుత్వ అధినేతగా చంద్రబాబు నాయుడు 460 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ 2026 జనవరిలోనే శంకుస్థాపన చేసిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అన్నిటి కంటే మించి వెలిగొండ నిర్వాసితులకు 900 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఐదేళ్ల పదవీకాలంలో జగన్ నిర్వాసితులకు ఒక పైసా కూడా చెల్లించకుండా మోసం చేశాడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2557 మంది నిర్వాసితులకు 318 కోట్లు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు మళ్లీ మరో 1600 మంది నిర్వాసితలకు 200 కోట్లు ఇచ్చామని చెప్పారు. మిగిలి మొత్తాన్ని కూడా వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో పాటు చెల్లిస్తామన్నారు. తమ ప్రభుత్వానికి ప్రాజెక్టు ఎంత ముఖ్యమో నిర్వాసితులు కూడా అంతే ముఖ్యమని రామానాయుడు చెప్పారు. ఈ రెండేళ్లలోనే 3,000 కోట్ల రూపాయలు వెచ్చించి వెలిగొండ కల సాకారం చేసినందుకు చంద్రబాబు నాయుడుకి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిర్వాసితులకు కోసం ఏర్పాటు చేసిన ఏడు కాలనీలలో నాలుగు పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. మిగిలిన మూడు కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు.

# రిజర్వేషన్లతో బీసీలకు అందలం : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత





**అమరావతి, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నేతృత్వంలో బీసీ నాయకుల సంబరాలు జరుపుకున్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి బీసీ నేతలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. బీసీలకు వెన్ను దన్నుగా అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే లభించాయన్నారు. తొలుత అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజ్యాధికారంలో భాగస్వాములు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలను అన్నిరంగాల్లో ముందంజలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 1995లో సీఎం చంద్రబాబు నాయుడు ఆ సంఖ్యను 34 శాతానికి పెంచారన్నారు. 2021 వరకూ ఆ రిజర్వేషన్లు కొనసాగుతూ వచ్చాయన్నారు. జగన్ వచ్చిన తరవాత స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు కోత విధించి, 24 శాతం అమలు చేశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బీసీలకు పదవులే కాకుండా ఆర్థికంగా లబ్ధి కలిగించే పథకాలను సైతం జగన్ రద్దు చేశారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో బీసీలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారన్నారు.

ఇదేంటని ప్రశ్నించిన బీసీలను, ఆ సామాజిక వర్గ నేతలను తప్పుడు కేసులతో వేధించారన్నారు. మరోసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, బీసీలకు మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలు కోల్పోయిన పదవులు మరోసారి లభించనున్నాయన్నారు. నిర్ణయాధికారంతోనే బీసీలకు అందలం దక్కుతుందని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వర్, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటి, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఎన్నికల నిర్వహణకు సిద్ధం



**గుంటూరు, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని చెప్పారు. బ్యాలెట్ పెట్టెల అవసరం కొంత మేర ఉండవచ్చని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా సిద్ధం చేయాలని, పోలింగ్ కేంద్రాల పరిస్థితిపై దృష్టి సారించాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్ లను గుర్తించి శిక్షణ అందించాలని, కార్యక్రమాల నిర్వహణ షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఎన్నికల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, వాటి బందోబస్తు పట్ల దృష్టి సారించాలని ఆదేశించారు. స్థానికంగా సమకూర్చుకోవలసిన ఎన్నికల సామగ్రి, రాష్ట్ర స్థాయి నుండి రావలసిన సామాగ్రి జాబితాపై స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నారు. కోర్టు వ్యవహారాలలో ఉన్న స్థానిక సంస్థలపై పూర్తి నివేదిక సమర్పించాలని చెప్పారు. ఓటరు జాబితాను తాజా పరచడం విషయంలో షెడ్యూల్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ ఫొటో జర్నలిస్ట్ వై.డి.ఆనంద్‌ను సత్కరించిన జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**అమరావతి, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో బహుమతులు గెలుచుకున్న ఫొటోగ్రాఫర్లకు బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ బహుమతీ ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య మీటింగ్ హాలులో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు డా. జి. లక్ష్మీశ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సభలో కేటగిరి – 1లో 3 కన్సొలేషన్ బహుమతి పొందిన సీనియర్ ఫొటో జర్నలిస్టు వై. డి. ఆనంద్ను కలెక్టర్ లక్ష్మీశ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ డే గురించి వై. డి. ఆనంద్ రెండు నిమిషాలు ప్రసంగించారు.

# అవయవదాత కుటుంబాలకు రూ.లక్ష సాయం

## - సీఎం చంద్రబాబుకు ప్రతిపాదనలు పంపాం - 5,920 మంది అవయవాల కోసం నిరీక్షణ - కొత్త నిబంధనలతో అవయవదానానికి ఊతం

## - 'స్వాప్ దానం'కు అవకాశం : శాసనసభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి - మంత్రి ప్రవేశపెట్టిన మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లుకు సభ ఆమోదం



**అమరావతి, (రాజధాని వార్తలు):** జీవన్మృతుల (బ్రెయిన్‌డెడ్) వ్యక్తుల అవయవదానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ. 10,000 నుంచి ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు–2026పై బుధవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. అవయవదానం, ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులు, బిల్లులోని ముఖ్యాంశాల గురించి వివరించారు. ఒక బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి ఎనిమిది అవయవాలను సేకరించి అవసరమైన వారికి అందించవచ్చని మంత్రి తెలిపారు.

**5,920 మంది నిరీక్షణ**

రాష్ట్రంలో సుమారు 5,920 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వీరిలో దాదాపు 100 మంది గుండె, 3,000 మంది కిడ్నీ, 2,000 మంది లివర్ మార్పిడి కోసం నిరీక్షిస్తున్నారని మంత్రి వివరించారు. పాంక్రియాస్ మార్పిడి కోసం నలుగురు ఉన్నారని తెలిపారు. పుట్టిన నెల రోజుల వయసున్న శిశువుల నుంచి 90 ఏళ్ల వయసున్నవారి వరకు అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. పదేళ్లలోపు వయసున్న సుమారు 40 మంది పిల్లలు కూడా ఈ జాబితాలో ఉన్నారని వెల్లడించారు.

**అపోహలు తొలగింపులో ఎమ్మెల్యేలూ భాగస్వామ్యం కావాలి**

అవయవదానంపై అపోహలను తొలగించే దిశగా ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రజల్లో ప్రభావం చూపగల ప్రముఖులను కూడా భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు ద్వారా అవయవదానంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. అలాగే అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు శాసనసభ్యులు అవయవదానం ప్రాముఖ్యత గురించి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

**ఉద్యోగ కల్పనపై పరిశీలన**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవన్మృతుల అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకొస్తే రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నామని, దాత పార్థివ దేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతున్నాయన్నారు. అలాగే దాతల కుటుంబాల ఆర్థిక నేపథ్యం ఇతర అంశాల ప్రాతిపదికన అర్హులైన వారు ఉంటే పొరుగు సేవలు లేదా ఒప్పంద విధానంలో ఉద్యోగాన్ని ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.10 వేల సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు స్పష్టం చేశారు.

**మూడు నుంచి తొమ్మిదికి అవయవ మార్పిడి కేంద్రాలు**

రాష్ట్రంలో ఉన్న ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాల సంఖ్యను మూడు నుంచి తొమ్మిదికి పెంచామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అవయవ మార్పిడి సేవలను విస్తరించడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని 12 టీచింగ్ ఆసుపత్రులను కూడా రాబోయే రోజుల్లో ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. కిడ్నీ, లివర్ వంటి అవయవాల మార్పిడిలో ప్రైవేటు ఆసుపత్రుల వాటా ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ రంగంలోనూ ఈ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగంలోని పద్మావతి ఆసుపత్రిలో గత ఏడాది 18 హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరిగినట్లు మంత్రి వెల్లడించారు.

**100 మందికి పైగా దాతలు ముందుకొచ్చేలా కృషి**

ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అవగాహన కార్యక్రమాల ఫలితంగా అవయవదాతల సంఖ్య పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2023లో 41 మంది దాతలు ముందుకు రాగా 126 అవయవ మార్పిడులు జరిగాయి. 2024లో 66 మంది దాతలు ముందుకు వచ్చి 210 అవయవ మార్పిడులు జరిగాయి. 2025లో 93 మంది దాతలు ముందుకు రాగా 300 అవయవ మార్పిడులు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటికే 74 మంది దాతలు ముందుకు వచ్చారని, 200కు పైగా అవయవ మార్పిడులు జరిగినట్లు మంత్రి తెలిపారు. ఏడాది ముగిసేలోగా 100 మందికి పైగా దాతలు, 400కు పైగా అవయవ మార్పిడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వం మేరకు ఈ రంగంలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.

**తాత.. అవ్వలకు అవకాశం**

బిల్లులో పేర్కొన్న కొత్త నిబంధనలతో భార్య, భర్త, తల్లిదండ్రులు, పిల్లలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లతోపాటు తాత, అవ్వ, మేనమామ, మేనత్తలను కూడా దగ్గరి బంధువులుగా గుర్తించనున్నట్లు మంత్రి తెలిపారు. గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో అవయవదాన ప్రక్రియను సమన్వయం చేసేందుకు ప్రత్యేక బాధ్యుల నియామకం జరుగుతుందని తెలిపారు. దాత–గ్రహీతల వివరాలను నమోదు చేసి మార్పిడి ప్రక్రియను పర్యవేక్షిస్తారని చెప్పారు.

**'స్వాప్ దానం'కు అవకాశం**

రెండు కుటుంబాల్లో దాత–గ్రహీతలకు అవయవాలు పరస్పరం సరిపడే పరిస్థితుల్లో 'స్వాప్ దానం'కు అవకాశం లభిస్తుందని తెలిపారు. నిర్దిష్ట వైద్య పరిస్థితుల్లో గుండె ఆగిన తర్వాత కూడా అవయవ సేకరణకు అవకాశం ఉంటుంది. మైనర్ల నుంచి అవయవాలు, కణజాలాల సేకరణపై కఠిన పరిమితులు విధించినట్లు తెలిపారు. విదేశీయులకు అవయవదానం విషయంలో ప్రత్యేక అనుమతి తప్పనిసరి చేశామని, అవయవాల అక్రమ కొనుగోలు, అమ్మకాలు, మధ్యవర్తిత్వాన్ని అరికట్టేందుకు కఠిన శిక్షలు నిబంధనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా అవయవం తొలగిస్తే గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు, రూ.20 లక్షల జరిమానా.. అక్రమ వ్యాపారానికి 5–10 ఏళ్ల జైలు, రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానా విధించేలా నిబంధనలు ఉన్నాయని మంత్రి వివరించారు.

**బిల్లుకు ఆమోదం**

అసెంబ్లీలో మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ప్రవేశపెట్టిన బిల్లుకు చర్చ అనంతరం డిప్యూటీ స్పీకర్ శ్రీ రఘురామ కృష్ణంరాజు ఆమోదం తెలిపారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు పటిష్ట చర్యలు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**- ఎన్‌కార్డ్ సమావేశంలో గంజాయి అక్రమ రవాణా, నిరోధక చర్యలపై సమీక్ష - గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం - 2025-2026లో ఇప్పటివరకు 50 ఎన్‌డీపీఎస్ కేసులు..162 మంది అరెస్టు - 879.5 కిలోల డ్రై గంజాయి స్వాధీనం.. 21 వాహనాలు సీజ్ : ఎస్పీ డా.అజిత వేజెండ్ల**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎన్‌కార్డ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులు, అరెస్టులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, సీజ్ చేసిన వాహనాల వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ అజితా వేజండ్ల జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు, కేసుల వివరాలను సమావేశంలో వెల్లడించారు. 2025 సంవత్సరంలో 41 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 129 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో 546.085 కిలోల డ్రై గంజాయి, 0.527 లీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని 16 వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. 2026లో ఆగస్టు 17వ తేదీ వరకు 9 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 33 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసుల్లో 333.407 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని 5 వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. దీంతో 2025, 2026 సంవత్సరాల్లో ఆగస్టు 17వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 50 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు కాగా, 162 మంది నిందితులను అరెస్టు చేశారు. మొత్తం 879.5 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని 21 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. గత ఎన్‌కార్డ్ సమావేశం నుంచి 2026 ఆగస్టు 17వ తేదీ వరకు జిల్లాలో 3 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 7 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసుల్లో 314.545 కిలోల కాంట్రాబాండ్‌ను స్వాధీనం చేసుకుని ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు. పునరావృత నేరస్తులు ఎవరూ గుర్తించబడలేదని, ఒక కేసులో పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

**మాదకద్రవ్యాల నియంత్రణపై సమగ్ర కార్యాచరణ**

సమావేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులపై దర్యాప్తు, ఆర్థిక లావాదేవీల పరిశీలన, అక్రమ ఆస్తుల గుర్తింపు, మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేసే చర్యలపై చర్చించారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం, హిస్టరీ షీట్ల నిర్వహణ, విద్యా సంస్థల పరిసరాల్లో భద్రతా చర్యలను బలోపేతం చేయడంపై సమీక్షించారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, తనిఖీలు ముమ్మరం చేయడం, హెల్ప్‌లైన్ సేవలపై ప్రచారం కల్పించడం, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్య, సంక్షేమ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని, యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ముందస్తు అవగాహన, నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

డ్రగ్ ఇన్స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు దీక్ష, సౌజన్య, డిఆర్వో విజయ్ కుమార్, డిఎంహెచ్వో డా. సుజాత సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లాలో మెగా రుణమేళా నిర్వహణకు బ్యాంకర్లకు సూచన

**- బ్యాంకులు, నాబార్డు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్న ఎంపీ వేమిరెడ్డి**
**- రుణమేళా నిర్వహణకు ఎంపీగా పూర్తి సహకారం అందిస్తా - 2025-26లో 128 శాతంతో జిల్లా బ్యాంకర్ల బృందం పనితీరు అభినందనీయం - ఈ ఏడాది టార్గెట్‌లో ఇప్పటికే మంచి ప్రగతి**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాల సబ్సిడీలను మరింత దగ్గర చేసేందుకు మెగా రుణమేళా నిర్వహించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా యంత్రాంగానికి సూచించారు.

బ్యాంకులు, నాబార్డ్, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన జరిగిన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో ఎంపీ మాట్లాడారు.

**పల్నాడు జిల్లా నరసరావుపేట తరహాలో నెల్లూరులో మెగా రుణమేళా**

నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ ద్వారా 1.04 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల విలువైన రుణాలు, సబ్సిడీలు ఒకే రోజు అందజేశారని ఎంపీ గుర్తు చేశారు. అదే స్థాయిలో నెల్లూరు జిల్లాలో కూడా అర్హులైన ప్రజలకు గరిష్ఠంగా మేలు జరిగేలా ఒక కార్యక్రమానికి ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాని, బ్యాంకర్లను కోరారు. అధికారులు, బ్యాంకర్లు చర్చించుకుని స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

**టార్గెట్‌ను మించి పనిచేస్తున్న జిల్లా బృందం**

జిల్లాలో బ్యాంకింగ్ రంగం చూపిస్తున్న పురోగతిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభినందించారు. గతేడాది 128 శాతం పనితీరు కనబరిచారని, ఈ ఏడాది కూడా నిర్దేశించిన లక్ష్యాల కంటే ఎక్కువే సాధిస్తున్నారని కొనియాడారు. ఈ పనితీరు చూస్తుంటే రుణమేళాను కూడా అత్యంత విజయవంతంగా నిర్వహించగలరనే నమ్మకం ఉందన్నారు.

**ఎంపీగా నా వంతు పూర్తి సహకారం**

పార్లమెంట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా ఉన్నందున ఈ రుణమేళా నిర్వహణకు కావాల్సిన ప్రయోజనాలను, అనుమతులను సాధించడంలో ఎంపీగా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా మన జిల్లా ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచే గొప్ప అవకాశంగా చూడాలని, మన తోటి సోదర సోదరీమణులకు మంచి చేస్తున్నా మనే భావనతో ప్రతి అధికారీ పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు మొగిలి వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం) మణిశేఖర్, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డి.డి.ఎం) డాక్టర్ బాబు , 27 బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వెంకటాచలం సత్రం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల, ఐపిఎస్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి. పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ ఇండెక్స్, మిస్సింగ్ కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను మరియు పిజిఆర్ఎస్ పిటిషన్స్ నిర్దేశిత గడువులో నాణ్యమైన దర్యాప్తు, విచారణతో పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, డే & నైట్ బీట్స్, క్రైమ్ హాట్‌స్పాట్లలో డ్రోన్ నిఘా, సోషల్ ఈవిల్స్‌పై నిఘా, హైవే పెట్రోలింగ్ మరింత పటిష్టం చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతపై నిరంతరం దృష్టి పెట్టాలని, సైబర్ సేఫ్టీ, పల్లె నిద్ర, "డ్రగ్స్ వద్దు బ్రో" వంటి అవగాహన కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లలో CCTV కవరేజీని విస్తరించి, CCTV-360 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. CCTNS పెండింగ్ ఎంట్రీలను ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేసి, డిజిటల్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి నేపథ్యంలో 24×7 గస్తీ, పెట్రోలింగ్, వాహన తనిఖీలు, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పోలీసులు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు మరింత చేరువగా, విశ్వసనీయమైన మరియు ఫ్రెండ్లీ పోలీసింగ్ అందించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పలు ఉత్సవాలు బందోబస్తులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సీసీటీవీ మరియు డ్రోన్స్ నిఘా మధ్య నిర్వహించాలి. ఈ తనిఖీలో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, వెంకటాచలం సత్రం పిఎస్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు, ఎస్ఐ ఆంజనేయులు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత దివ్యాంగురాలు తులసి వైద్యం కోసం బొజ్జల సుధీర్ రెడ్డి భరోసా



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తొట్టంబేడు మండలంలోన్ పిల్ల మేడు పంచాయతీ మామిడిగుంట దళితవాడలో వున్న దళిత దివ్యాంగురాలు తులసి వైద్యం కోసం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చి మానవత్వం చాటుకున్నారు. దీంతో నియోజకవర్గంలోని దివ్యాంగులు, దళితులు ఫిదా అవుతున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ వున్నారు. గత జూలై 31న తొట్టంబేడు మండలం పిల్ల మేడు పంచాయతీ మామిడిగుంట దళితవాడలో ఇంటింటికి మీ సుధీర్ అన్న అనే కార్యక్రమంలో పర్యటించారు. అక్కడ దివ్యాంగురాలు తులసి దీనస్థితిని చూసి ఎమ్మెల్యే చలించింది. ఆమె కళ్లలోని ఆవేదన ఎమ్మెల్యేని కదిలించింది.మంచి వైద్యం అందిస్తే తులసి మళ్లీ నడవగలదని తెలిసింది. దీంతో మానవతా దృక్పథంతో చలించి వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తాను మాట ఇస్తే తప్పనని, తనసొంత ఖర్చుతోనైనా దివ్యాంగురాలు తులసికి చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం, ఇచ్చి వదిలేసే రకం కాదని, ఇచ్చిన మాట కోసం నిలబడే తత్వం తనదన్నారు. అందులో భాగంగా తులసికి మెరుగైన వైద్యం అందించడానికి ఎమ్మెల్యే చెన్నై అపోలో వైద్యులతో మాట్లాడి చికిత్స చేయిస్తానని ఆ రోజే మాట ఇచ్చారు. వారికి చెప్పిన విధంగానే చెన్నై అపోలో నిపుణుల బృందాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి రప్పించారు. తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు మునిరాజా నాయుడు సహకారంతో దివ్యాంగురాలు తులసిని ప్రభుత్వవాహనంలో ఆమె ఇంటి నుంచి ఆసుపత్రికి తీసుకుని వచ్చేలా చేశారు. ఆసుపత్రిలో వైద్యులు ఆమెకు అవసరమైన అన్ని పరీక్షలు పూర్తి చేశారు. రిపో ర్టులు వచ్చాక మరింత మెరుగైన వైద్యం అందిచేందుకు వీలవు తుందని చెప్పారు. ప్రస్తుతం తాను అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నానని, అయినప్పటికీ ఎప్పటికప్పుడు తులసి గురించి ఫోన్లో ఆరా తీస్తూనే ఉన్నానని ఎమ్మెల్యే తెలిపారు. అసెంబ్లీ విరామ సమయంలో స్వయంగా వీడియో కాల్ ద్వారా తులసితో మాట్లాడానని, చికిత్సలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని వైద్యులకు, స్థానిక నాయకులకు సూచించామన్నారు. తులసి చికిత్సకు ఎంత ఖర్చైనా తాను వెనకాడనని, తన సొంత ఖర్చుతోనైనా లేదా సీఎం సహాయ నిధి ద్వారానైనా తులసికి పూర్తి వైద్యాన్ని అందించి తులసి తిరిగి ఆమె కాళ్ళపై నడిచేలా చేసి తులసికి ఆత్మ స్థైర్యం నింపుతామన్నారు. తులసి విషయంలో తాను ఒక నాయకుడిగా కాకుండా మీ ఇంటి సొంత మనిషిగా ఆమెకు అండగా ఉంటానన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తులసి మళ్లీ తన కాళ్లపై తాను నడిచేలా చేయడమే నా సంకల్పం అని స్పష్టం చేశారు. దీంతో నియోజకవర్గంలోని దళితులు, దివ్యాంగులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# క్రీడాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం : డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** క్రీడాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అని, డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు అన్నారు. మంగళవారం ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడా విభాగం అధ్యక్షులు జీవివిఎస్ కమలాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ క్రీడలపట్ల విద్యార్థులను చైతన్యం చేసి క్రీడల వల్ల దేశం ముందడుగు వేస్తుందని, భావిభారత భవిష్యత్ పౌరులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా విభాగ అధ్యక్షులు జివివి కమలాకర్ మాట్లాడుతూ నేడు దేశంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదని ప్రతి దాంట్లో వెను కబాటుతనం చోటు చేసుకుందని, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకువస్తే వారికి న్యాయం చేకూరేవరకు పోరాడతామని తెలిపారు. ఈ కార్య క్రమంలో సూళ్లూరుపేట నియోజ కవర్గ సమన్వయకర్త కిరణ్, శ్రీకాళహస్తి నియోజక వర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, దేవదానం, మణి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీను గౌడ్, జిల్లా కార్యదర్శులు ఇళయ రాజా, గోపి, మాణిక్యం, ఎస్సీ విభాగ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధ్యక్షులు రత్నం, మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఫయాజ్, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, మండల అధ్యక్షులు తిరుమలై, షణ్ముగం, రఘునాథం, భాస్కర్, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు సునీల్ రెడ్డి, చందు, నాగరాజు, అరుణ్, చరణ్, జోసెఫ్, సారథి, ఆరుల్, ఆల్విన్, ధనశేఖర్, అంబేద్కర్, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మార్పుల ముంగిట్లో బీజేపీ!

జూలైలో అపూర్వ ప్రకంపనలు సృష్టించిన విద్యార్థుల నిరసనలు, ఆ తర్వాత నినాదాల హోరులో కొట్టుకుపోయిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో ఏమైనా మార్పు వచ్చిందా? ఇదే ఇప్పుడు దేశ రాజధానిలో ఒక ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నది. ప్రస్తావిత పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోనూ తీవ్ర స్థాయిలో ఉన్నదని చెప్పక తప్పదు. సమాజంలో వస్తున్న మార్పులపై ఉలిక్కిపడినట్లు కనపడిన ఆర్‌ఎస్‌ఎస్ ఉన్నట్లుండి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువతను, విద్యార్థులను సమీకరించే కార్యక్రమంలో పడింది. సోమవారం నుంచి విశాఖ పట్టణం పొలిమేరల్లోని గుడిలోవలో మూడు రోజుల పాటు జరిగే ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత సమన్వయ బైఠక్ సమావేశంలో బీజేపీతో సహా ఆరెస్సెస్‌కు చెందిన 32 అనుబంధ సంఘాలు హాజరవుతున్నాయి. ఈ సమావేశాల్లో కూడా 'జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలి?' అన్నదే ప్రధాన అజెండా. 2027 మార్చి నాటికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో భారీ అంతర్గత మార్పుల క్రమం పూర్తయి కొత్త నాయకత్వంతో ప్రజల ముందుకు సరికొత్తగా వచ్చే తరుణంలో గుడిలోవ సమావేశాలు జరుగుతున్నాయి. ఇవి 'సంఘ్' పరిణామ క్రమంలో కీలక భూమిక నిర్వహించనున్నాయి. 'సంఘ్'తో పాటు భారతీయ జనతా పార్టీలో పరివర్తనానికి కూడా ఈ సమావేశాలు దోహదం చేసే అవకాశాలు లేకపోలేదు. పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటు చేసుకున్న పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై కూడా ఉన్నదనడంలో సందేహం లేదు. 32 అనుబంధ సంఘాల్లో బీజేపీ ఒకటి అని 'సంఘ్'లో కొందరు భావించవచ్చు కాని ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీయే 'సంఘ్' రూపురేఖలను మార్చిందని చెప్పడానికి ఆస్కారం లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వంలోని సమస్త మంత్రిత్వ శాఖల్లోనూ 'సంఘ్' బాధ్యులు చేరడం ఒక ఎత్తు అయితే ప్రభుత్వం చేసే తప్పిదాలు, దుశ్చర్యల బాధ్యత కూడా 'సంఘ్' స్వీకరించాల్సి రావడం మరో ఎత్తు. పాకిస్థాన్ వెళ్లి మహమ్మదాలీ జిన్నాకు ఘనంగా నివాళు లర్పించినందుకు నాటి బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అద్వాణీని రాజీనామా చేయించిన ఘనత 'సంఘ్'కు దక్కింది. మరి అటువంటి నైతిక, సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో చలాయించగల శక్తి 'సంఘ్'కు ఉన్నదా? ఇదీ ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ నియామకాల్లోనూ, పొత్తుల నిర్ణయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ కీలక భూమిక నిర్వహించిన 'సంఘ్' ఇవాళ ప్రభుత్వాన్ని ప్రశ్నించగలదా, నిలదీయగలదా అన్నదే కీలక ప్రశ్న. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలని, విధాన నిర్ణయాల్లో తప్పిదాలు జరిగాయని మోదీ సర్కార్ అంగీకరించాలని ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ పదే పదే చెబుతున్నది. మరి ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నది? ఇది విస్మరించలేని విషయం. ఇవాళ రాహుల్‌గాంధీ సహా ప్రతిపక్ష నేతలు కొందరు బీజేపీతో సహా ఆర్‌ఎస్‌ఎస్‌ను రాజకీయాల బరిలోకి లాగి వాటి సైద్ధాంతిక స్పష్టతను ప్రశ్నిస్తున్నారు. తద్వారా ఆరెస్సెస్, బీజేపీని వారు ప్రజా న్యాయస్థానంలో నిలబెడుతున్నారనేది స్పష్టం. ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా 'సంఘ్', బీజేపీ మధ్య పెద్ద తేడా చూడని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ తన భావి సైద్ధాంతిక భూమికను నిర్ణయించుకోవడంతో పాటు తన అనుబంధ విభాగమైన బీజేపీని కూడా భావి అవసరాలకు తగ్గట్లు మార్చగలదా లేదా అన్నది తేలవలసి ఉన్నది. నిజానికి ఒక దశలో, తనకు, అర్‌ఎస్‌ఎస్ తోడ్పాటు అవసరం లేదని బీజేపీ వాదించే పరిస్థితి ఏర్పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా మాట్లాడుతూ 'మొదట్లో అంత సామర్థ్యం లేనప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ అవసరం మాకు ఉండేది. ఇవాళ మా పార్టీ బాగా విస్తరించింది. తన కాళ్లమీద తాను నిలబడింది. ఇక బీజేపీ తనను తాను నిర్వహించుకోగలదు' అని స్పష్టం చేశారు. అమిత్ షా వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అందువల్లే, 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించినప్పటికీ మోదీ, షా నాయకత్వాలకు తిరుగులేకపోయింది. ఆ తర్వాత ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించగలిగింది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. 'సంఘ్'లో కూడా అనేకమందికి మోదీ, షా నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అటు బహిర్గతంగా, ఇటు అంతర్గతంగా తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల సైద్ధాంతిక నైతికత ఏ సంస్థకు ఉంటుంది? బహుశా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు అవకాశం కల్పించిందేమో?! దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని, దానికొక పరిభాషను సృష్టించి లోకం మీదకు వదిలారు. దాన్ని స్వీకరించి ప్రత్యర్థులపై పదునైన విమర్శలు చేసేందుకు బీజేపీలో ఒక యంత్రాంగమే కొనసాగింది. బీజేపీ సైద్ధాంతిక భూమికను మోదీయే సృష్టించారా, అందుకు 'సంఘ్' ఆశీస్సులు ఉన్నాయా అన్న అనుమానాలకు తావు లేకుండా పోయింది. స్థూలంగా చెప్పాలంటే మోదీయిజమే బీజేపీ, 'సంఘ్' భావజాలాన్ని నిర్దేశించిందనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో కూడా ఇదే ఇజం కొనసాగింది. అయితే ఈ జూలైలో సంభవించిన పరిణామాల నేపథ్యంలో తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో 'సంఘ్' ముద్ర ప్రధానంగా కనపడుతుందని కొందరు సైద్ధాంతిక విశ్లేషకులు అంటున్నారు.

# సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు

### - సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను గుర్తించేందుకు తీవ్ర గాలింపు
### - కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసులతో సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం
### - కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దు : జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్





**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఈ నెల 3వ తేదీన సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కనుగొనేందుకు ఇండియన్ కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీస్, సివిల్ పోలీస్, మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో సముద్రంలో తీవ్ర గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు.సముద్రంలో చిక్కుకున్న వారిని గాలించేందుకు చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో చేపట్టిన పత్రికా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం అధికార యంత్రాంగం అన్ని విధాలా ముమ్మర చర్యలు చేపట్టిందన్నారు. ఆగస్టు 3వ తేదీ సాయంత్రం ఏడుగురు మత్స్యకారులు 'ఎంఓ 135' రిజిస్ట్రేషన్ నంబర్ గల సుమారు 12 మీటర్ల పొడవైన బోటులో ఓడలరేవు నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లారని తెలిపారు. సాధారణంగా 12 రోజుల వేట అనంతరం ఆగస్టు 15 లేదా 16 తేదీల్లో తిరిగి రావాల్సి ఉండగా, ఆగస్టు 5వ తేదీ వరకు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడినట్లు వివరించారు. అనంతరం వారి నుంచి ఎలాంటి సమాచారం అం దకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బోటులో విహెచ్‌ఎఫ్ సెట్ ఉన్నప్పటికీ ట్రాన్స్‌పాండర్ లేదని, తీరం నుంచి సుమారు 120 నుంచి 150 కిలోమీటర్ల దూరంలో లాంగ్ వాయే జ్‌కు వెళ్లిన నేపథ్యంలో గాలింపు పరిధిని విస్తరించినట్లు కలెక్టర్ తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం పరిధిలో సముద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకలకు బోటుకు సంబంధించిన పూర్తి వివరాలను అందించి అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఇండియన్ నేవీతో సమన్వయం చేసుకుని గాలింపు చర్యలను కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకారులు ఈశాన్య లేదా వాయువ్య దిశగా వేటకు వెళ్లి ఉండే అవకాశం ఉన్నందున కాకినాడ, ఉప్పాడ తదితర తీర ప్రాంతాల్లోని మత్స్యకార సంఘాలు, ఆయా జిల్లాల మత్స్యశాఖ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన ఇతర మత్స్యకార బోట్లకు గల్లంతైన బోటు వివరాలను తెలియజేసి, ఆచూకీ లభించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

**పోలీస్ శాఖ అన్ని విధాలా సహకారం**

జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం పోలీస్ శాఖ తరపున అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అల్లవరం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశామని పేర్కొన్నారు. మత్స్యకారుల ఫోన్ నంబర్లకు సంబంధించిన కాల్ డేటా రికార్డులు (సిడిఆర్), అందుబాటులో ఉన్న ఇతర సాంకేతిక సమాచారాన్ని విశ్లేషిస్తూ వారి ఆచూకీ గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. మెరైన్ పోలీస్, కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

**కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి**

సముద్రంలో వేటకు వెళ్లే కొన్ని బోట్లు వాతావరణం, సముద్ర పరిస్థితులు, వేట పరిస్థితుల ఆధారంగా 15 నుంచి 20 రోజుల వరకు సముద్రంలోనే ఉండి తిరిగి వచ్చే సందర్భాలు ఉంటాయని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అయిన ప్పటికీ, ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి గాలింపు చర్యలను వేగవంతం చేసిందని కలెక్టర్ తెలిపారు. రానున్న 2-3 రోజుల్లో మత్స్యకారుల ఆచూకీ లభించి వారు క్షేమంగా తిరిగి వస్తారనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేశారు. గాలింపు చర్యలకు సంబంధించిన ఎప్పటికప్పుడు సమాచారం, పురోగతిని ప్రతిరోజూ సాయంత్రం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (డి పి ఆర్ ఓ) ద్వారా మీడియా, ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ ఏడి కరుణాకర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కరప మండల విద్యార్థుల ఉషు ప్రతిభకు పతకాలతో విజయ కేతనం




**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో కరప మండలం విద్యార్థులు సత్తా చాటి పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి విజయ కేతనం ఎగరవేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 13వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉషు ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మహిళల విభాగంలో యాండమూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.రమాదేవి అండర్-12, 22 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. వేళంగి జెడ్‌పీహెచ్ పాఠశాల విద్యార్థిని చి.అంజలీశ్వరి అండర్-14, 35.4 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన పి.యస్మిత అండర్-14, 47 కేజీలు, పి.రమ్య శ్రీలక్ష్మి అండర్-12, 30 కేజీల విభాగాల్లో రజత పతకాలు సాధించారు. ఎన్. లహరి అండర్-14, 42.8 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించగా, గొల్లపా లెంకు చెందిన ఆర్.సోనిక అండర్-12, 20 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. పురుషుల విభాగంలో భానుప్రకాశ్ పాఠశాల విద్యార్థి సి.హెచ్. లక్ష్మి కృష్ణ ప్రసాద్ అండర్-12, 21 కేజీల విభా గంలో స్వర్ణ పతకం సాధించాడు. కరప ఉన్నత పాఠశాల విద్యార్థి ఏవీఎన్‌ఎస్ భాస్కర్ అండర్-14, 43 కేజీల విభాగంలో రజత పతకం, వేళంగి కేఎస్ పేట మోడ్రన్ స్కూల్ విద్యార్థి జి.హరిచరణ్ అండర్-14, 49 కేజీల విభాగంలో రజత పతకం సాధించారు. గొర్రిపూడి ఉన్నత పాఠశాల విద్యార్థి జి.రిత్విక్ అండర్-12, 24.6 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ప్రకాశం జిల్లా ఉషు కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ ఉషు అసోసియేషన్ అధ్య క్షులు ఎం.ఆదిశేషులు, ఉపాధ్యక్షులు ఆర్.సుందరం, కార్యదర్శి బి.నరసింహారావు ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను కాకినాడ జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. అంబేద్కర్, గ్రామ పెద్దలు, వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సూర్య ప్రసాద్, శ్రీనివాస్, ఎంసీసీ అధికారి, పీఈటీలు కంకణాల శ్రీనివాస్, వేణుగోపాల్, భానుప్రకాశ్ పాఠశాల ప్రిన్సిపాల్ కాళ్ల సత్యవేణి తదితరులు విద్యార్థులకు ఉషు, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందిస్తున్న మాస్టర్ యు. లోవరాజును అభినందించారు.

# భీమేశ్వరుని సన్నిధిలో డిప్యూటీ అంబాసిడర్ పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రాల్లో ప్రసిద్ధి చెందిన సామర్లకోట శ్రీ కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం భారతదేశపు ఐఎఫ్‌ఎస్సి డిప్యూటీ అంబాసిడర్ శ్రీనివాసులు రెడ్డి దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అధికారులు శ్రీనివాసులు రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన బాల త్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాంబాబు శర్మ వెంకన్న శర్మ సత్యనారాయణమూర్తి వేద పండితులు సోమేశ్వర శర్మ రాజగోపాల శర్మలు ఆలయ నంది మండపంలో ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులు రెడ్డికి వేద ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు మనోజ్, ఈశ్వరరావులు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రత్యేక ప్రసాదాన్ని శ్రీనివాసులు రెడ్డికి అందించారు. చారిత్రిక ప్రాధాన్యత కలిగిన ప్రాచీనా సామర్లకోట భీమేశ్వర స్వామి పంచరామ క్షేత్రాన్ని దర్శించడం ఆనందదాయకమైన శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

# కోట గురుకుల పాఠశాలను కొనసాగించాలి : ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



**కోట, (రాజధాని వార్తలు):** కోటలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలను అదే ప్రదేశంలో కొనసాగిం చాలని, అనివార్య పరిస్థితుల్లో మార్పు చేయాల్సి వస్తే చిల్లకూరు మండలం వరగలిలో ఎస్సీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఐఐటి, నీట్ కోచింగ్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు ఎక్సలెన్స్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా కోటలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అయితే గూడూరు నియోజకవర్గంలోని కోట, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 600 మంది నిరుపేద విద్యార్థులు ప్రస్తుతం ఈ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. గురుకుల పాఠశాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ నియోజకవర్గం కావడంతో పెద్ద సంఖ్యలో నిరుపేద విద్యార్థులు ఈ పాఠశాలపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఐఐటి, నీట్, కోచింగ్ అందించే ఎక్సలెన్స్ కాలేజీ ఏర్పాటు నిర్ణయానికి తాము మద్దతు ఇస్తున్నామని, అయితే విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వీలైతే కోటలోనే ఎస్సీ గురుకుల పాఠశాలను కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. తప్పనిసరిగా తరలించాల్సి వస్తే చిల్లకూరు మండలం వరగలిలో ఎస్సీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. తన వినతిపై మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సానుకూలంగా స్పందించి, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు.

# శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి ఆలయంలో ఘనంగా అన్నదానం



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో కొలువై ఉన్న శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి అభిషేకం, విశేష పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నదాన కార్యక్రమ నిర్వాహకులు ముని మోహన్ మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త పోణక శివకుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోణక దేవసేనమ్మ మనవరాలు రియా పుట్టినరోజు సందర్భంగా వారి దాతృత్వంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించడం ఆనందంగా ఉందన్నారు.


# చిన్న కొడుకుతో ఇలియానా క్యూట్ పిక్.. సోషల్ మీడియాలో పోస్ట్ వైరల్!



ఒకప్పుడు టాలీవుడ్‌ను ఏలిన గోవా బ్యూటీ ఇలియానా ది క్రూజ్ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటూ తన ఫ్యామిలీ లైఫ్‌ను ఎంతో హ్యాపీగా గడుపుతున్నారు. విదేశీయుడైన మైఖేల్ డోలన్‌ను సైలెంట్‌గా పెళ్లి చేసుకున్న ఈ భామ, 2023లో మొదటి బాబుకు, 2025లో రెండో బాబుకు జన్మనిచ్చారు. తాజాగా తన చిన్న కొడుకుతో ఉన్న ఒక క్యూట్ ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో అది కాసేపట్లోనే వైరల్ అయింది. నెటిజన్లు ఈ ఫోటోపై లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 2006లో 'దేవదాసు' సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఇలియానా, అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, ప్రభాస్, రవితేజ వంటి స్టార్ హీరోల సరసన నటించి క్రేజీ ఆఫర్లను అందుకున్నారు. ఇక ఆమె గ్లామర్, నటనకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. 'పోకిరి'తో మారిన జాతకం.. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా వచ్చిన 'పోకిరి' చిత్రం ఇలియానా కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఈ సినిమా ఇండస్ట్రీ హిట్ కొట్టడంతో ఇలియానా ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ అయిపోయారు. ఇక ఆ తర్వాత ఆమె కోసం నిర్మాతలు క్యూ కట్టారు. అయితే 'పోకిరి' తర్వాత ఆమె నటించిన ఐదు సినిమాలు వరసగా ఫ్లాప్ అయ్యాయి. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ తో చేసిన 'జల్సా' సినిమాతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. టాలీవుడ్‌లో ఫుల్ డిమాండ్ ఉన్న సమయంలోనే ఇలియానా హఠాత్తుగా తెలుగు సినిమాలకు దూరమై బాలీవుడ్‌కు వెళ్లారు. అక్కడ కొన్ని సినిమాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ సాధించలేకపోయారు. ఇక ఆ తర్వాత క్రమంగా సినిమాలకు గుడ్ బై చెప్పి తన వ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టారు.

పూర్తిగా ఫ్యామిలీ ఉమెన్‌గా ఇలియానా : ప్రస్తుతం ఇలియానా గ్లామర్ రంగానికి దూరంగా ఉంటూ కంప్లీట్ ఫ్యామిలీ ఉమెన్‌గా మారిపోయారు. భర్త మైఖేల్ డోలన్, ఇద్దరు పిల్లలతో కలిసి ఆనందంగా సమయాన్ని గడుపుతున్నారు. ఇద్దరు కొడుకులను చూసుకుంటూ ఎంతో సంతోషంగా లైఫ్ లీడ్ చేస్తున్నారు. ఇక అప్పుడప్పుడు పిల్లల ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులకు అందుబాటులో ఉంటున్నారు. సినీ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు చూసిన ఇలియానా, ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నారు. ఆమె పంచుకున్న లేటెస్ట్ ఫోటోను చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ దంపతులకు, పిల్లలకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# కమ్‌బ్యాక్ తర్వాత దిశా పటానీకి కొత్త ఛాలెంజ్.. ఇదే అసలు పరీక్ష!



బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ కెరీర్‌లో అవారాపన్2 ఓ కీలక మలుపుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఇమ్రాన్ హాష్మీకి ఈ సినిమా భారీ కమ్‌బ్యాక్‌ను అందించడంతో పాటు, దిశా పటానీ పేరు కూడా మరోసారి బాలీవుడ్‌లో డిస్కషన్ కు వచ్చింది. ఆగస్టు 14న రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద వేగంగా రూ. 100 కోట్ల మార్క్‌ను దాటడంతో పాటు ఇమ్రాన్ కెరీర్‌లో అతిపెద్ద సోలో హిట్‌గా నిలిచిందని తాజా నివేదికలు చెబుతున్నాయి. అయితే దిశాకు అసలు పరీక్ష సినిమా సక్సెస్‌తో అయిపోలేదు.

ఈ క్రేజ్‌ను ఆమె తన తర్వాతి సినిమాలకు ఎలా వాడుకుంటుందనేదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆమె ముందు ప్రధానంగా మూడు దారులు కనిపిస్తున్నాయి. మొదటి దారి.. బిగ్ స్టార్ కమర్షియల్ సినిమాలు. స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ సినిమాల్లో భాగం కావడం ద్వారా దిశా తన మార్కెట్‌ను మరింత పెంచుకోవచ్చు. పెద్ద సినిమాల్లో కనిపించడం వల్ల భారీ స్థాయిలో రీచ్, బ్రాండ్ వాల్యూ లభించే అవకాశముంది. అయితే కేవలం స్టార్ పవర్‌పై ఆధారపడే క్యారెక్టర్లు వస్తే, కథలో హీరోయిన్ ప్రాధాన్యం తగ్గిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. రెండో దారి.. గ్లామర్ ఓరియెంటెడ్ క్యారెక్టర్లు. దిశాకు ఇప్పటికే ఉన్న గ్లామర్ ఇమేజ్‌ను మరింత బలపరిచే కమర్షియల్ సినిమాలు ఆమెకు చాలా సులభమైన మార్గంగా చెప్పొచ్చు. యూత్‌లో ఉన్న క్రేజ్‌ను క్యాష్ చేసుకోవచ్చు. కానీ అదే ఇమేజ్‌లో ఎక్కువకాలం కంటిన్యూ అయితే నటిగా కొత్త కోణాలను చూపించే అవకాశం చాలా పరిమితమవుతుందని చెప్పొచ్చు. ఇక మరో దారి, పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ సినిమాలు. ఇదే దిశా కెరీర్‌కు అత్యంత కీలకమైన మార్గంగా మారొచ్చు. అవారాపన్2 తర్వాత ఆడియన్స్ లో ఆమె యాక్టింగ్‌పై కూడా డిస్కషన్స్ మొదలైన నేపథ్యంలో, కథను ముందుకు నడిపించే స్ట్రాంగ్ క్యారెక్టర్లు ఎంచుకుంటే తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చుకునే అవకాశం ఉంటుంది. అయితే ఈ మూడు మార్గాల్లో ఏదో ఒకదానినే ఎంచుకోవాల్సిన అవసరం లేదు. స్టార్ హీరోల కమర్షియల్ సినిమాతో పాటు స్ట్రాంగ్ క్యారెక్టర్ ఉన్న ప్రాజెక్ట్‌ను బ్యాలెన్స్ చేయడం దిశాకు బెస్ట్ ప్లాన్ అవొచ్చు. అవారాపన్2 ఇచ్చిన క్రేజ్‌ను కేవలం ఒక సినిమా సక్సెస్‌గా వదిలేయకుండా, సరైన కథలు మరియు క్యారెక్టర్లతో కొనసాగించగలిగితే మాత్రం ఇది దిశా పటానీ కెరీర్‌లో నిజమైన రీసెట్‌గా నిలిచే అవకాశం ఉంది.

# ఇప్పుడు ఆ ఆలోచనే మారిపోయింది: అనుపమ



అనుపమ పరమేశ్వరన్ రీసెంట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడింది. ఒకప్పుడు తనకు ఏకంగా 11 మంది పిల్లలు ఉండాలని అనుకునేదాన్నని చెప్పిన ఆమె.. ఇప్పుడు మాత్రం పిల్లలే వద్దనే స్థితికి వచ్చానని చెప్పింది. దాదాపు రెండేళ్ల పాటు ఉన్న ఒక రిలేషన్‌షిప్ తన ఆలోచనలను ఇంతగా మార్చేసిందని అనుపమ తెలిపింది. ఆ వ్యక్తి పేరు మాత్రం ఎక్కడా బయటపెట్టలేదు. ఆ రిలేషన్‌లో తనకు ఎదురైన కొన్ని విషయాలను కూడా అనుపమ వివరించింది. పీరియడ్స్ సమయంలో ఏదైనా ప్రశ్నిస్తే, సమస్య గురించి మాట్లాడితే కూడా దాన్ని తన మూడ్‌తో ముడిపెట్టి మాట్లాడేవారని చెప్పింది. ఒక దశలో తాను మహిళగా ఉండటం, పీరియడ్స్ రావడం కూడా తప్పేమో అన్న ఫీలింగ్ వచ్చేలా పరిస్థితి మారిందని తెలిపింది. నటిగా తాను సాధించిన విజయాల విషయంలో కూడా కాన్ఫిడెన్స్ తగ్గిపోయిందని చెప్పుకొచ్చింది. ఇది కేవలం పర్సనల్ లైఫ్ వరకే ఆగలేదని అనుపమ చెబుతోంది. తాను ఎలాంటి దుస్తులు వేసుకోవాలి, ఏ సినిమాలు చేయాలి అనే విషయాల్లో కూడా కంట్రోల్ పెరిగిందని చెప్పింది. 'డ్రాగన్' తన కెరీర్‌లో పెద్ద సక్సెస్ అయినా ఆ సినిమా ప్రమోషన్స్‌కు ఎందుకు వెళ్లలేదో ఇప్పుడు చెప్పగలనంటూ, ఆ రిలేషన్ కారణంగానే చాలా సినిమాలను కూడా వదులుకున్నట్లు వెల్లడించింది. మూడు నెలల్లోనే ఎంగేజ్‌మెంట్ గురించి కూడా మాటలు మొదలయ్యాయని అనుపమ తెలిపింది. అయితే తాను మాత్రం వెంటనే ఓకే చెప్పకుండా కొంత టైమ్ కావాలని అడిగిందట. తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు పెళ్లి, పిల్లల గురించి ఒకప్పుడు తనకు ఉన్న ఆలోచనలు కూడా అలాగే లేవని ఆమె మాటల్లో అర్థమవుతోంది. అయితే ఆమె ఎక్కడా తన మాజీ భాగస్వామి పేరు చెప్పలేదు. పర్సనల్‌గా ఇలాంటి ఫేజ్ నుంచి బయటకు వస్తున్న అనుపమ కెరీర్ మాత్రం బిజీగానే ఉంది. తెలుగులో ప్రస్తుతం 'క్రేజీ కళ్యాణం' చేస్తోంది.

బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కు తున్న ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, వీకే నరేష్, అఖిల్ ఉద్దెమారి కూడా కీలక పాత్రల్లో ఉన్నారు. పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. మరోవైపు శర్వానంద్‌తో 'భోగి' కూడా అనుపమ లైనప్‌లో ఉంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దీంతో పాటు షాన్ దర్శకత్వంలో ఒక సైకాలజికల్ థ్రిల్లర్‌కు కూడా ఆమె లీడ్‌గా ఎంపికైంది. 'ప్రేమమ్'తో మొదలైన అనుపమ కెరీర్ ఇప్పుడు తెలుగు, తమిళం, మలయాళం అంటూ ఒకే రకమైన పాత్రలకు పరిమితం కాకుండా సాగుతోంది.

# జైలర్ 2 ఫస్ట్ సింగిల్ కి ముహూర్తం ఫిక్స్.. మాస్ జాతరే!



సాధారణంగా సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లతో పోల్చుకుంటే హీరోలకు లైఫ్ టైం చాలా ఎక్కువ. అందులో భాగంగానే హీరోలు తమ సినిమాలతో వరుస ఫ్లాప్‌లు చవిచూసిన ఏదో ఒక సినిమా పడితే మాత్రం గట్టి కంబ్యాక్ ఇస్తారు. అయితే అలా కం బ్యాక్ ఇచ్చేవరకు హీరోలు కూడా నిందలు మోయక తప్పదు. ఒక హీరో వరుసగా ఫ్లాప్ లు చవి చూశారు అంటే.. ఇక ఆ హీరో పనైపోయింది.. బుట్ట సర్దే టైం వచ్చేసింది అని కొంతమంది అంటే.. మరి కొంతమంది రిటైర్మెంట్ తీసుకోవాల్సింది.. ఇంకా ఎందుకు సినిమాల్లో చేస్తున్నారు అని అనే యాంటీ ఫ్యాన్స్ కూడా లేకపోలేదు. అలాంటి ఎన్నో విమర్శల నుంచి తనను తాను నిరూపించుకుంటూ అందరినీ ఆశ్చర్యపరిచారు రజినీకాంత్. ఒకప్పుడు అద్భుతమైన చిత్రాలతో బ్లాక్ బస్టర్ విజయాలతో సూపర్ స్టార్ గా పేరు సొంతం చేసుకున్న ఈయన గత కొంతకాలంగా సరైన సక్సెస్ లేక ఇబ్బందులు పడ్డారు. కానీ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో జైలర్ సినిమా చేసి మళ్లీ తనను తాను ప్రూవ్ చేసుకున్నారు రజినీకాంత్. అప్పటినుంచి ఆయన చేస్తున్న ప్రతి సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంటూ దూసుకుపోతోంది. ఇకపోతే ఆయన కెరీర్ను మళ్ళీ నిలబెట్టిన జైలర్ సినిమా సీక్వెల్ ఇప్పుడు త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే.

ఒకవైపు షూటింగు వేగంగా జరుగుతుం డగా మరొకవైపు చిత్ర బృందం సినిమా అప్డేట్స్ వదులుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా జైలర్ 2 నుంచి మేకర్స్ ఒక అదిరిపోయే అప్డేట్ విడుదల చేశారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అనౌన్స్మెంట్ ను తాజాగా పంచుకుంది. ఆగస్టు 21వ తేదీన ఈ సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేయబోతున్నట్లు అధికా రికంగా ప్రకటించింది. ఈ మేరకు ఈ చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్ బ్యానర్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని అనౌన్స్ చేస్తూ రజినీకాంత్ లేటెస్ట్ పిక్‌ని పంచుకుంది. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై అభిమానులలో విపరీతమైన క్రేజ్ ఏర్పడిన విషయం తెలిసిందే.

# చినకాద గ్రామంలో 100 కె.వి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో గ్రామంలో 100 కె.వి కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు - పాత 63 కె.వి ట్రాన్స్ఫార్మర్ స్థానంలో కొత్త 100 కె.వి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు - కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుతో చినకాద గ్రామంలో లో- వోల్టేజి సమస్య తీరినట్లు అయింది : మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరివూరి నారాయణమూర్తి రాజు**





**దత్తిరాజేరు, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సర్ఫ్, ఎన్నారై వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ చొరవతో మండలంలోని చినకాద గ్రామంలో 100 కె.వి కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసుకున్నామని తెలుగుదేశం పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరివూరి నారాయణమూర్తి రాజు మంగళవారం విలేకరులకు తెలియజేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో 100 కే.వి ట్రాన్స్ఫార్మర్ను అతి తక్కువ కాలంలో మా గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం సాధ్యపడిందని శిరివూరి నారాయణ మూర్తి రాజు అన్నారు. గతంలో గ్రామంలో లో–వోల్టేజీ కారణంగా కొన్ని సంవత్సరాలుగా గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. లో- వోల్టేజీ కారణంగా ఇళ్లలో ఎన్నో విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతిన్నాయని గ్రామస్తులు తెలియజేశారని నారాయణమూర్తి రాజు అన్నారు. లో- వోల్టేజీ సమస్యను గజపతినగరం శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణమూర్తి రాజు చెప్పారు. సమస్యను విన్న వెంటనే గ్రామ ప్రజల అవసరాలకు స్పందించిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చినకాద గ్రామానికి 100 కిలో వాట్స్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేయించారని నారాయణ మూర్తి రాజు అన్నారు. ట్రాన్స్ఫార్మర్ను మంజూరు చేయించిన రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్కి చినకాద గ్రామస్తులు కృతజ్ఞతతో తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా సమస్యలకు స్పందిస్తూ, గ్రామాలలో అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నాయకత్వంలో ఇటువంటి ప్రజా ఉపయోగకరమైన పనులు మరెన్నో జరగాలని చినకాద గ్రామస్తులు కోరుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరివూరి నారాయణమూర్తి రాజు అన్నారు. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసిన విద్యుత్ సిబ్బందికి ఆయన ధన్యవాదములు తెలియజేశారు.

# ఘనంగా గుడ్ మార్నింగ్ కార్యక్రమం



**పెళ్లకూరు, (రాజధాని వార్తలు):** మండలంలోని రావులపాడు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ అభిప్రాయాలను నాయకులతో పంచుకుంటూ, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. ప్రజల్లో జగనన్న పాలనపై మంచి స్పందన కనిపిం చిందని జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి అంటూ పలువురు ప్రజలు తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నన్నం పుష్కిల్లా పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి అభిప్రాయాలను గౌరవిస్తూ ముందుకు సాగడమే గుడ్ మార్నింగ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తదుపరి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకోవడం, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం మన బాధ్యత ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే జగనన్న నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం స్పష్టంగా కనిపిస్తోంది అని అన్నారు. జగనన్నను ముఖ్యమంత్రిగా చూడాలి" అనే లక్ష్యంతో ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లో మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి మాతయ్య, ముని రాజయ్య పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరిడమ్మ అమ్మవారి ఆషాడ మాస ఆదాయం రూ. 61.35 లక్షలు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఇలవేల్పు దేవత అయిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాడ మాసం ఉత్సవాల ఆధాయం రూ. 61,35,051 వచ్చినట్టు ఆలయ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి తెలిపారు. ఈ ఏడాది ఆషాడ మాసానికి సంభందించి 35 రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భక్తులు సమర్పించిన హుండీలు, అన్నదాన ఆధాయాలను ఆమె వివరించారు. దానిలో హుండీల ద్వారా రూ. 60,10,453లు, అన్నదానానికి రూ. 1,24,598లు వెరసి రూ. 61,35,051లు ఆధాయం వచ్చినట్టు తెలిపారు. కాగా తాజాగా గత 17 రోజుల ఆధాయం లెక్కించగా రూ. 37, 88,776 లు లభించిందని తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష, ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు, భక్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, సిబ్బంది సమక్షంలో ఈనెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ ఆలయానికి వచ్చిన ఆధాయాన్ని లెక్కించారు. 17 రోజులు ఆధాయంగా హుండీల ద్వారా రూ. 37,09,515, అన్నదానం హుండీ ద్వారా రూ 79,246లు వెరసి రూ. 37,88,761 ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారి విజయలక్ష్మి తెలిపారు. జాతర ప్రారంభమై,



ఈరోజు నాటికీ 35వ రోజు వరకు హుండీల ద్వారా దేవస్థానమునకు సమకూరిన మొత్తం రూ. 60,10,453, అన్నదానం విరాళాల ద్వారా రూ. 1,24,598లు వెరసి రూ. 61,35,051లు వచ్చినట్టు చెప్పారు. కాగా గత సంవత్సరం ఉత్సవాల్లో హుండీల ద్వారా రూ. 51,32,909లు, అన్నదానం హుండీ ద్వారా రూ. 50,071 ఆదాయం వచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ ఆధాయ లెక్కింపు కార్యక్రమంలో జేవివో వి వి పల్లంరాజు, దేవాదాయ తనిఖీదారు వి ఫణీంద్ర కుమార్, కాకినాడ శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయం అధికారి లక్ష్మణ్, పెద్దాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం అధికారి కె జగదీశ్వర రావులు పర్యవేక్షించారు.

# మూడు దశాబ్దాలుగా నిరుపేదల సేవలో తరిస్తున్న శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్

**- ఉచిత వైద్య సేవలకు ప్రతీకగా డాక్టర్ మాధురి సుధ**

**విజయనగరం, (రాజధాని వార్తలు):** నిరుపేదలకు అందుబాటులో ఉండే వైద్యునిగా విజయనగరంలో గుర్తింపు పొందిన డాక్టర్ శ్రీరామమూర్తి బాటలో డాక్టర్ కిలపర్తి మాధురి సుధ నడుస్తున్నారు. మూడు దశాబ్దాలుగా నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ కిడ్నీ, లివర్, బ్రెయిన్, నరములు, షుగర్, కొలెస్ట్రాల్, పచ్చకామెర్లు, ఉబ్బెకామెర్లు, పాయిజనింగ్తో పాటు అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన డాక్టర్ శ్రీరామ్ మూర్తిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత విద్యావంతురాలు ఎండి జనరల్ మెడిసిన్ డాక్టర్ కిలపర్తి మాధురి సుధ అలుపెరుగక అవిశ్రాంతంగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఆమె అందిస్తున్న సేవలకు అభినందిస్తూ రాష్ట్ర నాయకులు తవ్వ మోహన్రావు ఆధ్వర్యంలో ఈరోజు డాక్టర్ మాధుసుధను ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నాయకులు బోండా రమేష్, జి.బాలు, సముద్రాల గురు ప్రసాద్ తదితరులు ఘనంగా




సత్కరించారు. ఈరోజు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని 200 మంది సద్వినియోగం చేసుకున్నారు.

# హెల్మెట్ లేకుండా వాహనాలకు ప్రవేశం లేదు : కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోకి ప్రవేశించే మార్గాల్లో వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేయాలని, హెల్మెట్ ధరించని వాహనదారులను నగరంలోకి అనుమతించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతో పాటు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీలోని అధికారులకు సూచించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎన్హెచ్ అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు రేడియం పెయింటింగ్ వేయాలని సూచించారు. హైవేలపై రాంగ్ రూట్లో వచ్చే వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఆ వివరాలను పోలీసులకు అందించాలని అన్నారు.

**క్షతగాత్రులకు గోల్డెన్ అవర్లో వైద్యం అందించాలి**

రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఆసుపత్రుల్లో చేర్పించి, ఒక గంట గోల్డెన్ అవర్లో వైద్య చికిత్స అందించేందుకు సహాయం చేసిన వారికి గుడ్ సమారిటన్ ప్రోత్సాహకాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచినట్లు కలెక్టర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు గురై నిస్సహాయ స్థితిలో ఉన్న బాధితులకు తక్షణ సాయం అందించి వారి ప్రాణాలను కాపా డేందుకు ప్రజలను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తోటివారి ప్రాణాలను కాపాడేందుకు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే ఆసుపత్రిలో చేరిన క్షతగాత్రులను ఈడార్లో నమోదు చేసి, పోలీసుల సహకారంతో రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తుందని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రధాన కూడళ్లలో ఆక్రమణలు తొలగించాలి**

నెల్లూరు నగర పరిధిలోని మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్హౌస్పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్ ఆక్రమణలు లేకుండా ట్రాఫిక్ సమస్యల నివారణకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రైవేటు ట్రావెల్ బస్సుల పార్కింగ్ కోసం సర్వోదయ కళాశాల గ్రౌండ్, కేవీఆర్ సమీపంలోని దేవాదాయ శాఖ ఖాళీ స్థలాలను పరిశీలించి, ట్రాఫిక్కు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. టోల్గేట్ వద్ద టాయిలెట్లు ఉన్నట్లు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కావలి సమీపంలో ఉన్న ట్రక్ లేబై సమాచారాన్ని కూడా వాహనదారులకు తెలియజేసేలా సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలకు వచ్చే సమావేశంలోపు పరిష్కార మార్గం చూపించాలని, చేపట్టిన చర్యలపై యాక్షన్ టేకన్ రిపోర్టుతో తదుపరి సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. తొలుత పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలను డిప్యూటీ ట్రాన్స్పోర్టు కమిషనర్ చందర్ వివరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు దీక్ష, సౌజన్య, డీఆర్ఓ విజయ్కుమార్, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లా స్థాయి అధికారులు, ట్రాఫిక్, పోలీసుశాఖ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఇచ్చిన లక్ష్యాల మేరకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్లో మంగళవారం రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ పాల్గొని అజెండాలోని వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో చర్చించిన అజెండా అంశాల ప్రకారం.. సెప్టెంబర్ నెలతో పాటు, అక్టోబర్ నెలకు సంబంధించి ప్రతిపాదిత గ్రామాలలో పంపిణీ పనులు వేగంగా సాగాలని సూచించారు. ముఖ్యంగా అక్టోబర్ నెలకు గాను 75 గ్రామాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ పాసుపుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఇందుకు అనుగుణంగా అధికారులు ఇప్పటినుంచే తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ఇవే కాకుండా రీసర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, రెవెన్యూ క్లినిక్స్, పిజిఆర్ఎస్ గ్రీవెన్సెస్, వెబ్ల్యాండ్ మ్యూటేషన్స్ మరియు 22ఏ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై కూడా సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ సి.హెచ్. సత్తిబాబుతో పాటు ఆర్డీవోలు, ఆన్లైన్ ద్వారా తహశీల్దార్లు, తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# నవదుర్గాలయంలో 21న వరలక్ష్మి వ్రత మహోత్సవం...నవదుర్గాలయంలో భారీ ఏర్పాట్లు





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** శ్రావణ శుక్రవారం రోజు వచ్చిందంటే ఈ ఆలయం వద్ద పండగ వాతావరణం నెలకొంటుంది. వేలాది సంఖ్యలో ముత్తైదువులు తరలిరాగా ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు కనుల పండుగగా జరుగుతాయి. స్త్రీలకు సకల సౌభాగ్యాలు, సిరి సంపదలు ఇచ్చే శ్రావణ శుక్రవారం పూజలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దానికి ప్రతీతిగా నిలిచిన సామర్లకోట పట్టణంలోని బడేలమ్మ చెరువు వద్దగల శ్రీ నవదుర్గ సహిత శ్రీ దుర్గా మల్లేశ్వర ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు ఈనెల 21వ తేదీ శుక్రవారం ఎంతో వైభవంగా జరగనున్నాయి. ఈ మహోత్సవానికి ఆలయ కార్యనిర్వహణ అధికారిణి, దేవీ పుత్రిక కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు అన్ని పూర్తి చేశారు.

**ప్రధానంగా జరిగే పూజా కార్యక్రమాలు :**

నవదుర్గ సమేత శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో 57వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే వరలక్ష్మి వ్రత పూజల్లో ప్రధానంగా ఉదయం ఏడు గంటలకు అమ్మవారికి వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా జరగనున్నాయి. అనంతరం అష్టలక్ష్మి వ్రత పూజలు పట్టణ ప్రముఖులు చంద్రు నాగకిరణ్ కుమార్, సత్య సౌమ్య దంపతులచే నిర్వహించనున్నట్టు కనక విజయలక్ష్మి చెప్పారు. అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలను నిర్వహించి, 2026 మంది ముత్తయిదువులతో ప్రత్యేక పూజలు చేపట్టి వారికి ప్రత్యేక రీతిలో విందు భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు వాయన సత్కారాలను అమ్మ కనక విజయలక్ష్మి చేతుల మీదుగా అందించనున్నారు. అలాగే పూజల్లో ప్రత్యేక కార్యక్రమంగా 316 మంది ముత్తైదువులకు డ్రా పద్ధతిలో అమ్మ వారి చీరలను అందించే కార్యక్రమం ఆలయ పండితులు అల్లకి లక్ష్మణ శాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దివ్య కళ్యాణ పూజలు కనుల పండుగగా జరిపించనున్నారు. ఈ కళ్యాణ పూజలను వేద పండితులు పూజ్యం మల్లి కార్జున శర్మ సారధ్యంలో మార్నింగ్ వెంకటేశ్వర రావు, వీర కుమారి, వంక వీర్రాజు, వెంకటలక్ష్మి దంపతులచే జరిపించనున్నట్టు కనక విజయలక్ష్మి తెలిపారు. ఈ పూజల్లో ముఖ్య అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), వైసిపి పెద్దాపురం ఇన్చార్జి దవులూరి దొరబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్య క్షులు నిమ్మకాయల రంగనాగ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, వనమాడి కొండబాబు, సుధా ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండి ఈదుపుగంటి రామకృష్ణ, ప్రగతి విద్యాసంస్థల అధినేత నూతలపాటి పూర్ణ చంద్రరావు, శ్రీ లలిత ఇండస్ట్రీస్ ఎండి మట్టే శ్రీనివాసరావు, విద్యుల్లత దంపతులు, భారత్ మాత సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు గోరకపూడి చెన్నయ్య దొర, హిందూ ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు చేదులూరి గవరయ్య తదితరులు విచ్చేసి పాల్గొంటున్నట్టు ఆమె తెలిపారు.

ఈ ఉత్సవాల్లో ప్రముఖ దాతలుగా కాకినాడ సుబ్బయ్య హోటల్ యాజమాన్యం గునుపూడి గోవిందు, పద్మావతి దంపతులు, నేరెళ్ల దుర్గాప్రకాష్, హరిణి దంపతులు, సామ నాగ వెంకట శివరామయ్య, లక్ష్మీ దుర్గా తరంగిణి దంపతులు, టంగుటూరి శ్రీరామ్ కుమార్, శ్రావణి దంపతులు విచ్చేసి పాల్గొంటున్నారని చెప్పారు. ఈ శ్రావణ శుక్రవారం పూజలో జిల్లా నలుమూలల నుంచి ముత్తైదువులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి వాయినాలు, విందు భోజనాల్లో పాల్గొని దుర్గా మల్లేశ్వర అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా ఆలయ అధికారిణి కనక విజయలక్ష్మి కోరారు.

# ధైర్యంగా ఉండండి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది

## - ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు







**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఈనెల 3వ తేదీన బోటులో సముద్రంలో వేటకు వెళ్లి నేటి వరకు తిరిగి రాకుండా వారి సమాచారం తెలియకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్న 7 గురి మత్స్యకార కుటుంబాలను ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు మంగళవారం కలుసుకొని వారికి ధైర్యం చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మత్స్య శాఖ మంత్రి అచ్చం నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బోటులో వేటకు వెళ్లిన మత్స్యకార కుటుంబాలను కలుసుకొని ధైర్యం చెప్పేందుకు వచ్చానని పెద్దిరాజుది అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నంలోని బోటు యజమాని కొపనాతి రామకృష్ణ వర్మ కుటుంబాన్ని, ఓడలరేవులోని పాలెపు శాంతారావు, కొల్లాటి శ్రీను కుటుంబాలతో పెద్దిరాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కోస్ట్ గార్డ్, నావి, మెరైన్ విభాగాల సమన్వయంతో సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారని చైర్మన్ పెద్దిరాజు కుటుంబ సభ్యులకు వివరించారు.

అదేవిధంగా మత్స్యకారుల ఆచూకీ కనుగొని వారి కుటుం బాల వద్దకు చేర్చే వరకు అవిశ్రాంతంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మత్స్య శాఖ మంత్రి అచ్చం నాయుడు విషయం తెలిసిన వెంటనే ముఖ్యమం త్రితో మాట్లాడి నావికాదళ హెలికాప్టర్లతో గాలింపు చర్యలు చేపట్టాలని కోరారని తెలిపారు. ఉదుద్ తుఫాన్ వంటి తీవ్ర తుఫానులను ఎదుర్కొన్న అనుభవం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉందని సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మ రంగా జరుగుతున్నాయని వేటకు వెళ్లిన వారి కుటుంబాలు ఆందోళన పడవద్దని ఆయన అన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం అమలా పురంలోని కలెక్టర్‌తో మాట్లాడి గాలింపు చర్యలు ముమ్మరం చేసి వీలైనంత త్వరగా సముద్రంలో చిక్కుకున్న వారి జాడ కనుగొని వారి కుటుంబాల వద్దకు చేర్చేలా చర్యలు చేపట్టా లని చైర్మన్ పెద్దిరాజు కోరారు. ఆయన వెంట రాష్ట్ర ఎన్నికల క్షత్రియ కార్పొరేషన్ వెల్ఫేర్ డైరెక్టర్, అమలాపురం తాలూకా అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షులు లంకే భీమరాజు, ప్రధాన కార్యదర్శి కొప్పాడి వెంకట రామకృష్ణారావు, అల్లవరం మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరు సత్యనారాయణ రాజు, అమలాపురం తాలూకా అగ్నికుల క్షత్రియ సంఘం మాజీ అధ్యక్షులు పెమ్మాడి సాయి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, పశ్చి మాల ఏడుకొండలు,కొల్లు విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

**వేటకు వెళ్లిన వారి కుటుంబాలకు ధైర్యం చెప్పిన ఉన్నతాధికారులు**

ఈ నెల 3వ తేదీన బోటులో సముద్రంలోనికి వేటకు వెళ్లిన మత్స్యకారుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఎస్పి టీ ఆర్ ఎస్ కే ప్రసాద్, ఆర్డిఓ ఏ సరళా వతి, ఫిషరీస్ జెడి కరుణాకర్, ఏడి వి రమణారావు తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, ఎం పీడీవో గౌరీ కుమారి సముద్రంలో వేటకు వెళ్లి ఆచూకీ దొరకని మత్స్యకార కుటుంబాలను కలుసు కొని ధైర్యం చెప్పారు.


చివరిగా వారు ఏ టవర్ పరిధిలో నుండి ఫోన్ మాట్లాడారు, ఏ దిశగా వెళ్లారు వంటి అంశాలతో గాలింపు చేపట్టామని ప్రభుత్వం కోస్ట్ గార్డ్, నావి, మెరైన్ డిపార్ట్మెంట్‌లతో సమన్వయం చేసుకొని గాలింపు ముమ్మరం చేశారని ఆందోళన చెందవద్దని కుటుంబ సభ్యులను కోరారు.

# ఓడలరేవులో పర్యటించిన మెరైన్ ఎస్పి

## - గాలింపు చర్యలలో పాల్గొన్న కోస్ట్ గార్డుకు చెందిన 5 నౌకలు, రెండు హెలికాప్టర్లు







**అల్లవరం, (రాజధాని వార్తలు):** సముద్రంలో చేపలు వేటకు వెళ్లి ఆచూకీ లభ్యం కాని 7 గురు మత్స్యకారుల కాపాడేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా మెరైన్ ఎస్పి శ్రావణి మంగళవారం కాకినాడ, ఓడలరేవులో పర్యటించారు. ఈనెల 3వ తేదీన తన అన్న కోపనాతి రామకృష్ణ వర్మతో పాటు మరో ఆరుగురుతో కలసి సముద్రంలో చేపల వేటకు వెళ్లారని నేటి వరకు వారు తిరిగి రాకపోగా వారి సమాచారం తెలియలేదని రామకృష్ణ సోదరుడు కొపనాతి భవానీ శంకర్ ఇచ్చిన ఫిర్యాదుపై మెరైన్, మత్స్యశాఖ, నావి, కోస్ట్ గార్డ ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి సహాయక చర్యలు చేపట్టా మని ఎస్పీ శ్రావణి తెలిపారు. మెరైన్ ఐజి గోపినాథ్ జట్టి ఉత్తర్వుల మేరకు ఇండియన్ నేవీ ఇండియన్ కోస్ట్ గార్డ్ విశాఖపట్నం, మత్స్య శాఖలను అప్రమత్తం చేసి గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. నార్త్ ఎస్పీ, డి.ఎస్.పి కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, ఐ సి జి ఎస్ కాకినాడ, ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో సెర్చ్ రిస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

ఈ గాలింపు చర్యలలో ఇం డియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన 5 కోస్ట్ గార్డ్ నౌకలు సోమవారం నుండి గాలింపు చర్యలు సాగిస్తున్నాయని తెలిపారు. అలాగే విశాఖపట్నం, చెన్నై నుండి రెండు డోర్నియర్ హెలికాప్టర్స్ ఈ గాలింపు ఆపరేషన్‌లో పాల్గొన్నాయని ఆమె తెలిపారు. ఓడల రేవులో ఆమె సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆమె వెంట డిఎస్పి కిరణ్ కుమార్ సిఐ ఎం వి వి ఎస్ ఎన్ మూర్తి, మెరైన్ సిబ్బంది ఉన్నారు.



# విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందించాలి

## - పొదలకూరు ఏ ఎస్ డబ్ల్యు ఓ సుధామణి

**పొదలకూరు, (రాజధాని వార్తలు):** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తే ఉన్నతాధికారుల నుంచి గుర్తింపుతో పాటు ప్రశంసలు లభిస్తాయని పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ సీహెచ్. సుధామణి అన్నారు. మంగళవారం పొదలకూరు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖలో ఉత్తమ ఉద్యోగిగా అవార్డు పొందిన అల్లం సురేష్‌బాబును ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధామణి మాట్లాడుతూ ఉన్నతాధికారులు అప్పగించిన పనులను సకాలంలో క్రమశిక్షణతో పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు అన్ని వేళలా అందుబాటులో ఉండటం సురేష్‌బాబుకు అవార్డు రావడానికి ప్రధాన కారణమన్నారు. విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తనకు కేటాయించిన విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే ఉన్నతాధికారుల ప్రశంసలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పొదలకూరు, మనుబోలు వసతి గృహ సంక్షేమాధికారులు ప్రసన్నబాయి, అనిత, మల్లేశ్వరి, ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టేళ్ల మస్తానయ్య, సాంఘిక సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాయల ముద్దుకృష్ణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688899
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# చిన్న, మధ్యతరహా, పీరియాడికల్స్ పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**- ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇంచార్జ్ జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు - ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా, చిన్న దినపత్రికలు అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కమిటీల ఏకగ్రీవ ఎంపిక - పెన్షన్, బీమాతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**








**అనంతపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి మధ్యతరహా, చిన్న పత్రికల పరిరక్షణ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాయలసీమ జిల్లాలు ఇన్చార్జి జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం అనంతపురం నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా, చిన్న దినపత్రికలు అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల నూతన కమిటీలను ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఏపీ మీడియం స్మాల్ డైలీస్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి హుస్సేన్ ఖాన్, కలిమిశ్రీ సౌహార్ద సందేశం పంపించి, స్థానిక పత్రికల యజమానులు, జర్నలిస్టులు, రిపోర్టర్లు, పోటోగ్రాఫర్లు అందరినీ ప్రోత్సహించి అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా అనంతపురం డీఎస్పీ చంద్రశేఖర్ హాజరై ఆంధ్రప్రదేశ్ మీడియం స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పత్రికల పరిరక్షణకు, అలాగే అందులో పని చేస్తున్న జర్నలిస్టుల హక్కుల కోసం పని చేస్తామని చెప్పారు. మరోవైపు నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మధ్యతరహా, చిన్న, ఇతర పత్రికలకు ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలలో 30% వాటా ఉండేలా చూడాలన్నారు. పత్రికల ఎంపానల్మెంట్ సమస్యలు, ప్రభుత్వానికి సంబం ధించిన వార్తల కవరేజీకి సంబంధించి మధ్యతరహా చిన్న పత్రికలకు తప్పనిసరిగా తగు ప్రతినిధ్యం కల్పించాలని కోరారు. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించే దిశగా పని చేస్తామని స్పష్టం చేశారు.

**అనంతపురం జిల్లా నూతన కమిటీ ఇదే..**

గౌరవాధ్యక్షులుగా శంకర ప్రసాద్ (తెలుగోడు), జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ (ధర్మ విజేత), ఉపాధ్యక్షుడిగా లోకేష్ (అనంత కోకిల), రామాంజినేయులు (మనం), జోడు రమేష్ (కదిలించే వార్త), ప్రధాన కార్యదర్శిగా కే. శ్రీరాములు (నారి – భేరి), సహాయ కార్యదర్శులుగా ప్రసాద్ (బహుజన వేదిక), నాగేంద్ర (అనంత కళా వేదిక), శరత్ కుమార్ రెడ్డి (అక్షర ప్రభ), కోశాధికారిగా జీ.ఆనంద్ (అక్షయ న్యూస్), కార్యవర్గ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు సుబ్బయ్య (ప్రజాబాట), సంజీవ రెడ్డి (సాయంకాలం), భూపాలం సతీష్ కుమార్ (వినియోగ దర్శిని), భాస్కర్ (జన సూర్య), భాస్కర్ (మనం), నరసింహ మూర్తి (నలివేటి ఎక్స్‌ప్రెస్), హరికృష్ణ (అనంత సూర్య), బాలరాజు (జన సూర్య), రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సిరిసాల సురేష్ (నేషలిస్ట్ హాబ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**శ్రీ సత్య సాయి జిల్లా నూతన కమిటీ ఇదే..**

జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎన్.నారాయణ (రాయల్ న్యూస్ పక్షపత్రిక, హిందూపురం), జిల్లా అధ్యక్షులుగా బి.రవీంద్రనాయక్ (వాయిస్ ఆఫ్ విక్టరీ ఎడిటర్, కదిరి), జిల్లా ప్రధాన కార్యదర్శిగా కే.ఎన్. నాగరాజు (పల్లె జీవనం మాసపత్రిక ఎడిటర్ మడకశిర), జిల్లా ఉపాధ్యక్షులుగా సాకే శ్రీనివాసులు (ఎడిటర్ జనతరంగం డైలీ ధర్మవరం), కోలా బ్రహ్మయ్య (సంధ్యవేళ సాయంకాలం ఎడిటర్, కదిరి), జాయింట్ సెక్రెటరీగా పి.మల్లిక (జాబిలి మాసపత్రిక ఎడిటర్, పెనుగొండ), కోశాధికారిగా పి. మహబూబ్ బాషా (ఆంధ్ర ప్రతి దినపత్రిక సబ్ ఎడిటర్, కదిరి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షులు తలారి రామాంజనేయులు, జిల్లా నాయకులు డాక్టర్ సూర్య, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, సుబ్బయ్య, శంకరప్రసాద్, బాబ్జాన్, సురేష్, శ్రీరాములు, ఓ.భాస్కర్, డాక్టర్ ఉద్దండం చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రముఖ జ్యోతిష్యులు రామానందనాథ కాళిదాసు శర్మ ఆశీస్సులు అందుకున్న నితిన్ నబీన్

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు గౌరవనీయులు నితిన్ నబీన్‌ని పార్వతీపురం పట్టణంలో శ్రీ విద్యా సర్వమంగళ పీఠాధిపతి, ప్రముఖ నాడీ జ్యోతిష్యులు రామానందనాథ మురపాక కాళిదాసు శర్మ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

ఈ సందర్భంగా వేదోక్త ఆశీ ర్వచనాలతో జాతీయ అధ్యక్షులను ఆశీర్వదించిన పీఠాధిపతులు, అమ్మవారి శేషవస్త్రాలు మరియు అమ్మవారి చిత్రపటాన్ని నితిన్ నబీన్ కి భక్తిశ్రద్ధలతో కానుకగా ఇచ్చారు.

దక్షిణ భారతదేశంలో వికసిత్ భారత్ లక్ష్య సాధనకు, దేశ అభివృద్ధికి నితిన్ నబీన్ చేస్తున్న ప్రయత్నాలకు పీఠాధిపతుల అనుగ్రహం, అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని నితిన్ నబీన్ ఆకాంక్షించారు. దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించి ప్రజల సంక్షేమం మరింత ముందుకు సాగాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికత, ప్రజాసేవ, దేశాభివృద్ధి లక్ష్యాలతో నాయకులు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan